

సమస్యాత్మక కేంద్రాలపై

గట్టి నిఘా...

- స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత
- ప్రజల్లో భరోసాకు 13 కేంద్ర కంపెనీలు
- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- ప్రజాశక్తితో కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ క్రైమ్

'కర్నూలు రేంజ్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బలగాల ద్వారా గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. నాలుగు జిల్లాల పరిధిలో 13 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను ఏర్పాటు చేశాం. రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో అక్రమ రవాణా చోటు చేసుకోకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలుచోట్ల నగదును స్వాధీనం చేసుకున్నాం. లైసెన్సుడు గన్నులను డిపాజిట్ చేసుకున్నాం. ప్రతి పార్లమెంట్ పరిధిలోని స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను ఏర్పాటు చేశాం' అని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయ రావు తెలిపారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఎన్నికల నిర్వహణ భద్రత ఏర్పాట్లకు సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు...



మాట్లాడుతున్న డిఐజి విజయరావు

ఎన్ని పోలీసు కంపెనీ బలగాలను కేటాయించారు?

డిఐజి : కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో మొత్తం 13 పోలీసు కంపెనీ బలగాలను ఏర్పాటు చేశాం. ఒక్కొక్క జిల్లాకు మూడు కంపెనీల చొప్పున 12 కంపెనీలు కాగా ఒక నంద్యాలకు నంద్యాల జిల్లాకు మాత్రం నాలుగు కంపెనీలను కేటాయించాం. ఆయా జిల్లాల్లో సమస్య ఆత్మక ప్రాంతాలను గుర్తించి కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్, కవాతు నిర్వహిస్తున్నాం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారా?

డిఐజి : కడప జిల్లాలో 513, అన్నమయ్య జిల్లాలో 400, నంద్యాల జిల్లాలో 370, కర్నూలు జిల్లాలో 320 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం. అక్కడ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక రూటు ఆఫీసర్లను ఏర్పాటు చేసి ఆ రూట్లో ఒక వాహనంతో పాటు ఐదుగురు సిబ్బంది ఉంటారు. ఏదైనా ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదు అందితే వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : కర్నూలు రేంజ్ పరిధిలో కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 28, కడప జిల్లాలో 67 గ్రామాలను ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలుగా గుర్తించాం. అక్కడ ఫ్యాక్షన్ జోన్ పరిధిలో ప్రత్యేక ఇన్స్పెక్టర్లను కేటాయించాం. గత పది ఏళ్లలో ఎవరు ఫ్యాక్షన్ కార్యకలాపాలను ప్రేరేపిస్తున్నారో గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిని ఉంచాం. ఎన్‌బిడబ్ల్యులను పూర్తిచేశాం. ఎన్నికల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను ఎమ్మార్వో సమక్షంలో బైండోవర్ కేసులను నమోదు చేశాం.

ఎన్ని లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకున్నారు ?

డిఐజి : బ్యాంకుల వద్ద ఉన్న లైసెన్సుడు గన్నులు మినహా అన్ని లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకుంటున్నాం. ఇప్పటివరకు కర్నూలు జిల్లాలో 577, నంద్యాల జిల్లాలో 779, కడప జిల్లాలో 678, అన్నమయ్య జిల్లాలో 764 లైసెన్సుడు గన్నులను స్వాధీనం చేసుకున్నాం.

స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచల భద్రత వ్యవస్థతో కట్టుదిట్టం చేస్తున్నాం. మొదటి వ్యవస్థలో కేంద్ర పోలీసు బలగాలు, రెండో వ్యవస్థలో ఏపీఎస్పీ బలగాలను, మూడవ వ్యవస్థలో జిల్లా పోలీసు బలగాలతో కట్టుదిట్టం చేస్తున్నాం. జాయింట్ లెవెల్ ఆఫీసర్లతో భద్రతను పర్యవేక్షిస్తున్నాం.

నాటుసారా తయారీ, మద్యం అక్రమ రవాణాపై ఎలాంటి నివారణ చర్యలు తీసుకుంటున్నారు?

డిఐజి : నాలుగు జిల్లాల పరిధిలో ఎక్కడైనా నాటుసారా బట్టీల ఏర్పాటు, తయారీ, రవాణా, రాష్ట్ర ఇతర మద్యం రవాణపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులతో దాడులు నిర్వహించి కేసులు కడుతున్నాం. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో రెండు, అన్నమయ్య జిల్లాలో ఒకటి ఉన్నాయి. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఒక్కో జిల్లాలో 10 పైగా ఉన్నాయి. చెక్ పోస్టుల్లో నగదును, అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీజ్ చేస్తున్నాం. కర్నూలు జిల్లాలో రూ.2.45 కోట్లు, నంద్యాల రూ 37 లక్షలు, కడప రూ.10.71 కోట్లు, అన్నమయ్య జిల్లాలో దాదాపు రూ.37 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నాం. లిక్కర్ కేసులు కడపలో 1000 పైగా, కర్నూలు 360, నంద్యాల 250, అన్నమయ్య 650 పైబడి కేసులు నమోదు చేశాం. ఇప్పటి వరకు సి-విజిల్ యాప్‌లో 80 ఫిర్యాదులు నాలుగు జిల్లాల పరిధిలో అందగా వాటిని ఆయా జిల్లాలో ఎస్పీలు పరిష్కరిస్తున్నారు.

నంద్యాల జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో ఒక షాడో జోన్ ఉంది. కర్నూలు రేంజ్ పరిధిలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో రోడ్డు, ఫోన్ కమ్యూనికేషన్ ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు ఎవరు విఘాతం కలిగించినా కఠినంగా చర్యలు తీసుకుంటాం. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి.

దాహం తీరేనా..?

- గ్రామాల్లో గుక్కెడు నీటికి తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వేసవి ఆరంభంలోనే గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతి ఏడాదీ నీటి కోసం తిప్పలు తప్పడం లేదు...

మండే వేసవి ఆరంభమైంది. వేసవితో పాటే నీటి సమస్య కూడా మొదలైంది. ప్రజల మౌలిక వసతులు తీరుస్తామని, నీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని పాలకులు ఆర్భాటంగా హామీలు ఇచ్చినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. గుక్కెడు నీటి కోసం ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కర్నూలు జిల్లాలో 32 సిపిడబ్ల్యుసి నీటి పథకాల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు. 4,261 చేతి పంపులు ఉండగా వాటిలో వేసవి వస్తే 210 చేతి పంపుల్లో నీళ్లు రావడం లేదు. మిగిలిన వాటిలోనూ అరకొరగా నీళ్లు వస్తున్నాయి. 796 పిడబ్ల్యు పథకాలు ఉండగా వాటిలో 692 మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో నీటి సమస్య తప్పడం లేదు.

కర్నూలు జిల్లాలోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి, కోసిగి, పెద్దకడబూరు, హోళగుంద, గోనేగండ్ల, మంత్రాలయం మండలాల్లో నీటి ఎద్దడి నెలకొంది. ఆస్పరి మండల పరిధిలోని పుప్పల దొడ్డిలో నీటి సమస్యతో తల్లడిల్లి పోతున్న పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండల కేంద్రమైన ఆస్పరితో పాటు తురవగల్లు, ఐనేకల్లు, తోగలగల్లు, డి.కొటకొండ, బైలు పత్తికొండ, గార్ల పెంట, ములుగుందం, జోహరపురం, దొడగొండ, హలిగేర గామాలలో నీటి ఏద్దడి నెలకొంది. పుప్పాల దొడ్డి గ్రామంలో 130 కుటుంబాలు ఉండగా 947 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామానికి ప్రధానంగా నీటి సరఫరా కోసం గ్రామ సమీపంలోని చెరువులో రెండు బోర్లు వేయించారు. చెరువులో భూగర్భ జలాలు అడుగంటడంతో అరకొర నీటి సరఫరా అవుతుంది. ఆ అరకొర నీరు గ్రామస్తుల దాహార్తిని ఏ మాత్రం తీర్చ లేకుండా పోతుంది. గ్రామానికి ప్రత్యామ్నాయంగా నీరు లేకపోవడంతో వ్యవసాయ బోర్ల పై ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. వ్యవసాయ బోర్లకు ఉదయం పూట కరెంటు సరఫరా తక్కువగా ఉండడంతో రాత్రిపూట ఎక్కువగా ఉంటుంది. పరిస్థితులలో రాత్రి అయినప్పటికీ జాగరణ చేసి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి కోసం ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యక్తి ప్రత్యేకంగా ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఆదోని మండలంలోని అనేక గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడింది. మండుతున్న ఎండలతో ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. తుంగభద్ర దిగువ కాలువ ఆధారంగా గ్రామాలతోపాటు ఇతర గ్రామాల్లో కూడా నీటి సమస్య రోజు రోజుకు తీవ్రంగా మారింది. మండలంలోని జాలిమంచి, గణేకల్, పాండవగల్, బసాపురం, పెద్దహరివాణం, సంతేకూడ్లూరు, బైచిగేరి, కపటి, నేట్టేకల్, సాంబగల్, పెద్దపెండేకల్, చిన్నపెండేకల్, దిబ్బనకల్ గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి కోసం ప్రతి రోజు ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్ళి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న తాగనీటి పథకాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తాగునీటి తప్పిక తీర్చుకోవడమే రోజంతా పని చేయాల్సిన పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆలూరు పట్టణంలో 15రోజులకోసారి తాగునీరు వస్తున్నాయి. హాలహర్వి మండలం బాపురం పథకం నుండి సరఫరా అవుతుంది. వేసవికి ముందుగానే తాగునీటి కొరత ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆస్పరి మండలం పుప్పాలదొడ్డిలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నీటి సమస్యను పరిష్కరించండి



మా గ్రామంలో 130 కుటుంబాలు ఉన్నాయి. తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. బిందెడు నీటి కోసం రాత్రనక పగలనక కుళాయి దగ్గర వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజా ప్రతినిధులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.

- రామాంజనేయులు, పుప్పాల దొడ్డి, ఆస్పరి మండలం.

15 రోజులకోసారి నీళ్లు వస్తున్నాయి



మా కాలనీలో ప్రతి ఏడాది తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ ఏడాది కూడా ఇదే సమస్య పునారావృతం అవుతోంది. ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యంతో నీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి.


- విఠల్, సిద్దేశ్వర కాలనీ, ఆలూరు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తాగు నీటి సమస్య రాకుండా చేపట్టాల్సిన చర్యలపై పంచాయతి రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. వచ్చే రెండు మూడు నెలలకు సంబంధించి నీరు ఎంతవరకు అందుబాటులో ఉంది? తాగునీటి సమస్య పరిష్కారానికి ఏ విధంగా చర్యలు తీసుకోవాలి అనే అంశంపై ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎల్ఎల్‌సి నుండి ఆధారపడిన సిపిడబ్ల్యుఎస్ పథకానికి సంబంధించి నీటిని డ్రా చేసుకొని 16 ఎస్ఎస్ ట్యాంకులలో నీటిని స్టోరేజ్ చేసుకుంటున్నారా? ఒకవేళ ఎల్ఎల్‌సి నుండి నీరు రాకపోయినా ఎస్ఎస్ ట్యాంకులలో స్టోర్ చేసుకున్న నీటిని ఎన్ని రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు అనే వివరాలను ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇని అడిగి తెలుసుకున్నారు. మండలాలలో ఎన్ని బోర్లు ఉన్నాయి, అందులో ఎన్నిరిపేర్లు ఉన్నాయి, రిపేర్ ఉన్న వాటిలో రిపేర్ చేయిస్తే ఎన్ని పని చేస్తాయనే వివరాలను కూడా అందచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మెయింటెనెన్స్ ఆఫ్ హ్యాండ్ పంప్స్‌కు సంబంధించి 15వ ఆర్థిక కమిషన్ గ్రాంట్ కింద చేయించాల్సి ఉంటుందని ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, గాజులదిన్నె ప్రాజెక్టులో ఉన్న నీటిని బ్యాలన్స్ చేసుకుంటూ ప్రతిరోజు నీటిని ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కింద చేయించే పనులలో మొదటి ప్రాధాన్యతగా ఏప్రిల్ మాసంలో కూలీలతో అన్ని హ్యాబిటేషన్ ప్రాంతాలలో వర్షపు నీటిని స్టోర్ చేసుకునేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

నేడు ఐలమ్మ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు నూతన జిల్లా కార్యాలయం ఈనెల 27న బుధవారం ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ దగ్గరలో ఉన్న ఆద్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎదురుగా కార్మిక కర్షక భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి ఎపి రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. కర్నూల్ జిల్లా పరిధిలోని రజక వృత్తిదారులు, కార్యాలయ నిర్మాణానికి సహకరించిన దాతలు శ్రేయోభిలాషులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అర్చకునిపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్‌ను శిక్షించాలి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కాకినాడ శివాలయంలో అర్చకునిపై దాడికి పాల్పడిన మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌ను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకట రామరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడికి గురైన సాయిశర్మ, విజయ్ కుమార్‌శర్మ మనోధైర్యంతో ఉండాలన్నారు. బ్రాహ్మణులపై ఇలాంటి దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని, బ్రాహ్మణులపై దాడులు జరిగినప్పుడు వారిపై అట్రాసిటీ చట్టం పెట్టి మాజీ కార్పొరేటర్ మిరియాల చంద్రశేఖర్‌ను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య తరపున కోరుతున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



పోలకల్ జాతరలో కోడుమూరు డిటిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

పోలకల్ జాతరలో బొగ్గుల దస్తగిరి సందడి

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని పోలకల్‌లో చెన్న సోమేశ్వరస్వామి జాతర సందర్భంగా కోడుమూరు టిడిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి మాజీ జడ్‌పిటిసి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులతో కార్యకర్తలతో మంగళవారం సందడి చేశారు. ముందుగా చెన్న సోమేశ్వరునికి మొక్కులు తీర్చుకొని పెద్దలతో ఎన్నికల గెలుపు విషయమై చర్చలు జరిపారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డీ నాయకత్వంలో బరిలో ఉంటున్న నన్ను గెలుపునకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోముడు, ఎర్రమల, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఇబ్బందులెంతకాలం

-రోజు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
-హంద్రీ వక్కెర వాగు బ్రిడ్జిలను సందర్శించిన పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం, రహదారిపై ట్రాఫిక్ నియంత్రించడంలో అధికారులు విఫలం చెందారని హంద్రీ బ్రిడ్జిపై చేపట్టిన మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేయాలని పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్రం సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు నాగరాజు అన్నారు. మంగళవారం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం జాతీయ రహదారిపై పర్యటించి హంద్రీనది, వక్కెర వాగు బ్రిడ్జిపై జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పుల్లారెడ్డి, నాగరాజు మాట్లాడుతూ రూ.వందల కోట్ల పన్నులు వసూలు చేసుకోవడం తప్ప రోడ్ల అభివృద్ధి, ప్రజల రక్షణ పట్టించుకోవడంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు విఫలం చెందారన్నారు. బళ్లారి చౌరస్తా పై ఓవర్ బ్రిడ్జి నుండి కృష్ణానగర్ జాతీయ రహదారి పై ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల్లో కొందరికి కాళ్లు చేతులు విరిగి హాస్పిటల్ పాలౌతున్నా, ప్రాణాలు పోయినా స్థానిక ప్రజాప్రతిథులు స్పందించడం లేదని అన్నారు. ప్రతిరోజు రవాణా రంగంపై రూ.వందల కోట్ల టోల్ రుసుములు వసూలు చేసుకోవడం తప్ప ప్రజల రక్షణ గురించి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. జాతీయ రహదారికిరువైపులా నిబంధనల ప్రకారం సర్వీస్ రోడ్లు నదులపై బ్రిడ్జిలు లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా అభివృద్ధిపై మారు తల్లిప్రేమ చూపిస్తుందన్నారు. సర్వీసు రోడ్లస్థానంలోపెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లు బ్రిడ్జిలు పూర్తి చేయకుండా నాలుగు లైన్లలో వెళ్లాల్సిన ట్రాఫిక్‌ను రెండు లైన్లపై ఎలా మళ్లిస్తారనిప్రశ్నించారు. 2 నెలలుగా హంద్రీ బిడ్జి మరమ్మతుల పేరుతో ట్రాఫిక్ ను మళ్ళించి జరిగే ప్రమాదాలకు ప్రజల ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? లేక సంబంధిత కాంట్రాక్టర్ బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు స్పందించి సర్వీసు రోడ్లను, కల్లూరు వక్కెర వాగు, హంద్రీ బిర్జీల మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని కోరారు. సర్వీస్ రోడ్లు పూర్తి చేయకుండా ట్రాఫిక్‌ను ఒక వైపు మళ్లించికంట్రోల్ చేసే వాళ్ళు లేక తాను ప్రమాదానికి గురయ్యానంటూ గాయాల పాలైన డికె. హేమకాంత్ రెడ్డి గాయాలను మీడియా వారికి చూపించారు. ప్రమాదానికి గురైన వారితో పాటు స్థానికులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ ప్రతినిధి బృందంలో సంఘం నాయకులు సివి.వర్మ, ఎ.వెంకటేశ్వర్లు, ఎస్.రమణగౌడ్, శ్రీనివాసులు స్థానిక మెకానిక్‌లు పాల్గొన్నారు.



హంద్రీ వక్కెర వాగు బ్రిడ్జిలను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం

ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎంను గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఓల్డ్ సిటీ మండిబజార్ డీజిల్ ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) విస్తృత సమావేశం వెంకటేశులు అధ్యక్షతన సూర్జిత్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ 2014 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలపై రోజురోజుకు భారాలను పెంచుతుందని మండిపడ్డారు. జిఎస్‌టి వల్ల నిత్యవసర వస్తువులు ధరలు తగ్గుతాయని నమ్మ పలికిన బిజెపి జిఎస్‌టి వచ్చాక పసి పిల్లల పాల డబ్బా నుండి ప్రజలను ప్రాణాలను కాపాడే మందుల వరకు పన్నులు వేసిందని అన్నారు. ఒక్కో డీజిల్ ఆటో డ్రైవర్ పై పెంచిన డీజిల్ ధర సంవత్సరానికి రూ.లక్షఉంటుందని , రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.10000 ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాల కింద ఇస్తున్నారన్నారు. పేదలపై పన్నులు, ధనుకులకేమో రూ.13 లక్షల కోట్లు పన్నుల మాఫీ చేయడం, ఇదేం న్యాయమని ప్రశ్నించారు. నల్లధనాన్ని అరికట్టి ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తానన్న మోడీ, ప్రజా సంపదను ధనవంతులకు కట్టబెట్టారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల పేరుతో యువతని మోసం చేశారని అన్నారు. మతం పేరుతో దేశాన్ని నిట్ట నిలువుగా చీల్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా మన రాష్ట్రానికి మోడీ ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాజధాని నిర్మాణం వంటి హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కాయని తెలిపారు. ప్రతిపక్షాలపై సిబిఐ, ఇడి వంటి సంస్థలను, తన చెప్పు చేతుల్లో పెట్టుకొని మోడీ ప్రతిపక్ష పార్టీలను లొంగదీసుకునే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు, రాష్ట్రంలో టిడిపి, జనసేన వంత పాడటం సిగ్గుచేటని అన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం సంక్షేమానికే పరిమితమై రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెట్టుతూ, హక్కుల కోసం పోరాడే వారిని అణిచివేస్తూ నిరంకుశ పాలన చేస్తుందన్నారు. బిజెపితో జత కట్టిన టిడిపి, జనసేన కూటమిని, నిరంకుశ పాలన చేస్తున్న వైసిపిని ఓడించి, ప్రజల అనుకూలమైన విధానాల కోసం నిత్యం పోరాడుతున్న సిపిఎంకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకుడు గోవిందు, కర్నూలు నగరం ఓల్డ్ సిటీ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు డి.అబ్దుల్ దేశాయ్, ఎం.విజయ్ , డీజిల్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చాంద్‌బాషా, సాయి, జహంగీర్, రియాజ్, బషీర్, వెంకటేష్, లాలు, మోజెస్, సయ్యద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి



-రాతి దూలం పోటీలను ప్రారంభిస్తున్న అమర్నాథ్ రెడ్డి

ఆకట్టుకున్న రాతి దూలం పోటీలు

ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి మండలం లంకాయపల్లె గ్రామంలో పెద్దమ్మ అవ్వస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మంగళవారం అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలను గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి, వైసిపి నాయకుడు కడమకుంట్ల అమర్నాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి హుస్సేనపురం సుల్తాన్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టకు వచ్చే భక్తులకు గ్రామస్తులకు వినోదం కలిగించేందుకు ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో మొదటి విజేత వృషభ యజమానులకు రూ.30 వేలు నగదును వైసిపి నాయకుడు కడమకుంట్ల అమర్నాథ్ రెడ్డి అందజేశారు. రెండవ విజేత పుష్ప యజమానులకు రూ.20 వేలు సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ అందజేశారు. మూడో బహుమతి రూ.15 వేలు మాజీ బొబ్బిలి ఎంపిటిసి,ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ లు, నాలుగో బహుమతి రూ.10 వేలు టిడిపి నాయకులు కడమకుంట్ల లింగన్న, ఐదవ బహుమతి రూ.7500, ఆరో బహుమతి రూ.5 వేలనగదు బహుమతులు అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక వైసిపి నాయకుడు శంకర రెడ్డి ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలం హోసూరుకు చెందిన వికలాంగురాలు రంగమ్మకు తన తండ్రి చిన్న రామన్న 1-1 ఇంటి నెంబర్‌కు సంబంధించిన సెంటు స్థలంపై 'ఆర్‌డిఒకు అర్జీ ఇచ్చిన ఫలితం లేదు' అనే కథనాన్ని ప్రజాశక్తి ప్రచురించింది. పంచాయతీ సెక్రెటరీ ఎంపిడిఒ తప్పుడు నివేదిక ఇచ్చి రంగమ్మను తప్పుదోవ పట్టించారు. ఆర్‌డిఒ రామలక్ష్మి స్పందిస్తూ తహాశీల్దార్ మాధవరావును ఆ స్థలంపై పూర్తి విచారించాలన్నారు. మంగళవారం తహాశీల్దార్, విఆర్ఒ సర్వేయర్ గ్రామ తలారుల సమక్షంలో ఆ స్థలంపై కొలతలు వేశారు. తహాశీల్దార్ మాట్లాడుతూ రంగమ్మకు ఎలాంటి నష్టం కలగకుండా పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తానని తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ ఎంపిడిఒపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సహకరించాలి : సిఐ గౌతమి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలో తాగునీటి పైపులైను మరమ్మతు పనుల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని, రద్దీని తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని ట్రాఫిక్ సిఐ పి.గౌతమి కోరారు. 26న కర్నూలు నంద్యాల చెక్ పోస్ట్, టెలికాం నగర్ దగ్గర, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వారు వాటర్ పైప్ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నందున, ట్రాఫిక్ ఎక్కువగా రద్దీ పెరుగు తోందన్నారు. ఈ పనులు 27 వరకు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు టాఫిక్ రద్దీని గుర్తుంచుకొని ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

వైసిపి పాలనలో అందరికీ కష్టాలే

- 4వ వార్డులో మాజీ ఎమ్మెల్యే బీవీ ప్రచారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

వైసిపి పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని టిడిపి ఎమ్మిగనూరు అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బి.వి.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక 4వ వార్డులో ఎన్నికల ప్రచారం చేపట్టారు. 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బాబు వస్తేనే జాబు వస్తుందని, తాగు, సాగునీరు రావాలంటే టిడిపి గెలవాలని తెలిపారు. బటన్ నొక్కుతున్నా అంటున్న జగన్ ప్రజల పీక నొక్కుతున్నారని, 'సిద్ధం, మేం సిద్ధం' అంటూ ఫ్లెక్సీలు వేస్తున్నారని అన్నారు. కానీ ప్రజలకు చేసేందేమీ లేదన్నారు. టిడిపి నాయకులు రామదాసు గౌడ్, రంగస్వామి గౌడ్, కొండయ్య చౌదరి, సుందర్ రాజు, దయాసాగర్, రామకృష్ణ నాయుడు, నేసే మల్లికార్జున, రూపా జగదీష్, షాబీర్, కలీముల్లా, నజీర్ అహ్మద్, హుసేన్ పీర్, బోయ రంగన్న, బోయ అంజి, బోయ జయన్న, బోయ వెంకటేష్, కృష్ణ తేజ నాయుడు, దయాసాగర్, మిన్నెల్లా, కటారి రాజేంద్ర, దామ నరసింహులు, సలీం, సలాం, దాదావలి, బోయ సోమన్న, జహంగీర్, అంబేద్కర్, రంజిత్ కుమార్, ఎరుకల శ్రీనివాసులు, రవి కుమార్, గోవింద పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


రికార్డులను తనిఖీ చేస్తున్న నాగమద్దయ్య

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ వి.నాగమద్దయ్య హెచ్చరించారు. మంగళవారం నాగ మద్దయ్య ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృత పర్యటనలు చేపట్టారు. ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు సెబ్ స్టేషన్లను, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు బాపురం, మాధవరం, నాగులదిన్నెను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నాటుసారా, బెల్ట్ షాపులపై దాడులు మరింత విస్తృతం చేయాలని ఆదోని సెబ్ ఇన్‌స్పెక్టర్ విన్సీలత, కోసిగి సెబ్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, ఎమ్మిగనూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ భార్గవ రెడ్డిని ఆదేశించారు. నాటుసారా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పూర్తిగా నిర్మూలించాలని హెచ్చరించారు. పాత నేరస్తులపై సీఆర్‌పిసి 110, 109 ప్రకారం బైండోవర్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. అక్రమ మద్యాన్ని సరఫరా చేసే మార్గాల్లో రూట్ వాచ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే దాకా ఎటువంటి సెలవులు మంజూరు చేయరాదని, విధుల నిర్వహణలో ఉండాలని తెలిపారు. చెక్ పోస్టుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, కర్నూలు సెబ్ డివిజనల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరసనాయుడు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పురపాలకులకు తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలూ చేపట్టామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకులోని నీటి నిల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్‌సి కాల్వ నీటి ప్రవాహాన్ని ఎస్ఎస్ ట్యాంకులోకి మళ్లించామని తెలిపారు. ట్యాంకులో 2110 మిల్లీలీటర్ల నీరు నిల్వ ఉందన్నారు. పురపాలకులకు జూన్ చివరి వరకు ఈ నీరు సరిపోతాయని తెలిపారు. విద్యుత్ అంతరాయం, పైపులు పగిలిపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. నీటి ఎద్దడి పట్ల ఎవరూ ఆందోళన చెందవద్దని, సరిపడ నీరు నిల్వ ఉందని తెలిపారు. మున్సిపల్ ఇంజినీరు వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీరు రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

అపుస్మా డివిజన్ అధ్యక్షులుగా కోటేష్

ప్రజాశక్తి- దేవనకొండ


కోటేష్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచి

మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ యు.కోటేష్ అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) పత్తికొండ డివిజన్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. మంగళవారం మాజీ సర్పంచి రాజన్న, జడ్‌పి హైస్కూల్ ఎస్ఎంసి కమిటీ అధ్యక్షులు చిన్న వెంకప్ప, గ్రామ పెద్ద సత్యరాజ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ కోటేష్‌ను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీటుకు రూ.కోట్లు...

- ఆదోనిలో బిజెపి బేరసారాలు
- ఆడియో లీక్‌తో రాజకీయ దుమారం

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని అసెంబ్లీ సీటు పోటీ నుంచి తప్పుకోవాలంటే రూ.3 కోట్లు డిమాండ్ చేసే ఆడియో లీక్ కావడంతో రాజకీయ దుమారం నెలకొంది. రాష్ట్రంలోనే ఆదోని రాజకీయం రోజురోజుకు మలుపు తిరుగుతోంది. పది రోజుల నుంచి ఆదోని ఎమ్మెల్యే స్థానం బిజెపికి కేటాయించారన్న వార్తలు రావడంతో ఆదోని రాజకీయం వేడెక్కింది. హైదరాబాద్ కేంద్రంగా మంతనాలు సాగాయి. ఇంకా ఆదోని ఎమ్మెల్యే సీటు బిజెపికా లేక టిడిపికా అన్న విషయం స్పష్టత రాలేదు. మంగళవారం ఆదోని కేంద్రంగా ఉన్న సోషల్ మీడియాలోనూ, వివిధ టీవీ ఛానళ్లలోనూ టిడిపి, బిజెపి నాయకుల సంభాషణ కాల్ రికార్డింగ్ లీక్ కలకలం సృష్టించింది. ఆ ఫోన్ కాల్ రికార్డింగ్‌లో ఆదోని సీటును బిజెపి నుంచి టిడిపికి ఇస్తామని ఇందుకోసం బిజెపి అధిష్టానం, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పురందరేశ్వరికి రూ.3 కోట్ల దాకా ఇవ్వాల్సి ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు అల్లుడు మారుతీ నాయుడుతో బిజెపి జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ సోదరుడు కునిగిరి నాగరాజు పేర్కొనడం అందులో ఉంది. ఉదయం నుండి పట్టణంలో ఎక్కడికెళ్లినా, ఎవరిని పలకరించినా ఈ ఆడియో సంభాషణపైనే చర్చ జరిగింది. ఆదోని ఎమ్మెల్యే సీటును బిజెపి కోరిందని ఆ మేరకు బిజెపికే కేటాయిస్తున్నట్లు టిడిపి అధిష్ఠానం ప్రకటించిందని ప్రచారం జరిగింది. ఆదోనిలో బిజెపి గెలవడానికి అవకాశం ఇంకా లేదని ఆలూరును బిజెపికి కేటాయించి ఆదోని ఎమ్మెల్యే సీటు టిడిపికి కేటాయించాలని గత కొన్ని రోజులుగా టిడిపి నాయకులు విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలు కొలిక్కి వస్తున్న తరుణంలో ఈ ఆడియో కలకలం సృష్టించింది. ఈ ఆడియో సందేశం పూర్తి స్థాయిలో ఆదోని సీటును టిడిపి (బిజెపి) మీరు కోరుకుంటున్నారని ఆ సీటు మీ వాళ్లకు రావాలంటే కొంత ఖర్చు అవుతుందని ఆ డబ్బులు బిజెపి అధిష్ఠానం ఇవ్వాల్సి ఉంటుందని ఆడియోలో ఉంది. కచ్చితంగా ఆదోని సీటు బిజెపి నుండి టిడిపికి వచ్చే విధంగా తాము కృషి చేస్తామని అలాగే వచ్చే ఎన్నికల్లో కూడా ఆదోనిలో టిడిపి విజయానికి తాము కష్టపడి పని చేస్తామని బిజెపి నాయకుడు టిడిపి యువ నాయకుడితో జరిగిన సంభాషణలో పేర్కొన్నారు. ఆలూరులో సమావేశం జరుగుతుందని ఆ సమావేశంలో ఆలూరు నుండి బిజెపి పోటీ చేస్తుందని తీర్మానం చేస్తామని అందులో పేర్కొన్నారు. ఈ తీర్మానం అధిష్టానంకు పంపుతామని బిజెపి నాయకుడు ఫోన్లో స్పష్టం చేశారు. ఈ విధంగా తాము చేస్తే తమను చూసుకోవాలని ఇందుకోసం రూ.మూడు కోట్ల దాకా ఖర్చు అవుతుందని కూడా పేర్కొన్నట్లు స్పష్టంగా ఉంది. ఈ విషయం బయటికి ఎక్కడ తెలియకూడదని కేవలం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడుకు ఆయన సోదరుడు ఉమాపతి నాయుడుకు తప్ప ఇంకా ఎవరికి తెలియరాదని విషయాన్ని గోప్యంగా ఉంచాలని, డబ్బు విషయం వారితో మాట్లాడాలని టిడిపి యువ నాయకుడికి సంభాషణలో బిజెపి నాయకుడు కోరారు. తాను బయటకు రానివ్వనని తన ఈ విషయాన్ని తమ బంధువులకు తెలుపుతానని ఆయన పేర్కొన్నట్లు ఆడియోలో రికార్డింగ్ అయింది. ఈ ఆడియో రికార్డింగ్ ఆదోని పట్టణంలో కలకలం సృష్టించడంతో బిజెపి, టిడిపి అధిష్టానాలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు దీనిపై విచారణ చేస్తున్నట్లు కూడా సమాచారం. ఇదిలా ఉండగా ఈ విషయంపై బిజెపి జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సోదరుడు కునిగిరి నాగరాజు స్పందించారు. తన వాయిస్‌ను మార్ఫింగ్ చేసి రికార్డింగ్ చేశారని అసలు తాను ఆ విధంగా మాట్లాడలేదని, ఒక బిసి వర్గానికి చెందిన తన సోదరుడు తాను రాజకీయంగా ఎదుగుతున్న దానిని ఓర్వలేని టిడిపి నాయకులు ఇలా చేశారని ఆరోపించారు. ఈ రికార్డింగ్ విషయాన్ని తాము న్యాయపరంగా పోరాటం చేస్తామని పరువు నష్టం దావా కేసు వేస్తామని ఆయన స్పష్టం చేశారు. అసలు ఆ వాయిస్ తనది కానే కాదని నాగరాజు పేర్కొన్నారు.

'ఓటుహక్కు వినియోగం అందరి బాధ్యత'

ప్రజాశక్తి - నందవరం

ఓటుహక్కును వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిరంజీవి తెలిపారు. మంగళవారం నందవరంలోని ఎంపిడిఒ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగుతుందని, ఓటు చాలా విలువైనదని తెలిపారు. ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 15 వరకు ఓటు హక్కుకు దరఖాస్తుకు అవకాశం ఉందని చెప్పారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. తహశీల్దార్ ఓబులేసు, ఎంపిడిఒ మోహన్ రావు, ఎస్ఐ తిమ్మయ్య, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, ఎఒ కృష్ణమూర్తి, వెంకటరాముడు, ఆర్ఐ జెర్మీయా, ఎపిఎం వీరన్న, ఎపిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి పథకాలు పేదలకు అండ

- 26వ వార్డులో బుట్టా రేణుక ప్రచారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు పేదలకు కొండంత అండగా నిలిచాయని వైసిపి ఎమ్మిగనూరు అభ్యర్థి బుట్టా రేణుక తెలిపారు. మంగళవారం స్థానిక 26వ వార్డులో ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బుట్టా రేణుక ఇంటింటి ప్రచారం చేపట్టారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని అభ్యర్థించారు. వైసిపి నాయకులు బుట్టా శివ నీలకంఠ, శాప్ నెట్ వర్క్ కార్పొరేషన్ ఛైర్మన్ మాచాని వెంకటేష్, మల్లెల గ్రూప్ డైరెక్టర్, సామాజిక వేత్త మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, వైసిపి నాయకులు కదిరికోట సునీల్ కుమార్, బుట్టా రంగయ్య, రియాజ్ అహ్మద్, బోయ బజారి, కామర్తి నాగేశప్ప, శివ ప్రసాద్, సుధాకర్, రాజారత్నం, కొమ్ము రాజశేఖర్, ప్రతాప్ రెడ్డి, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్ రమేష్, రజాక్, మహబూబ్ బాష, గోకారి, రఘు, యాకత్, ఖిబుల హుసేన్, ఉబెద్, ఫయాజ్, చాంద్ బాషా పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక

పార్టీ శ్రేణుల రక్షణ, అభివృద్ధి కోసమే

- టికెట్ ఆశిస్తున్నాను - అధిష్టానం పునరాలోచించి టికెట్ నాకే ఇస్తుంది - టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపిని నమ్ముకున్న పార్టీ శ్రేణుల కోసం, నాయకులు, కార్యకర్తల కోసం, నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం టికెట్ ఆశిస్తున్నానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. డబ్బు కోసం, అధికారం కోసం కాదని, టిడిపి అధిష్టానం పునరాలోచించి కచ్చితంగా తనకే ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి అధ్యక్షతన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తనకు టికెట్ రాకుండా చేశారని ఆవేదన చెందారు. తనకు, పార్టీ అధిష్టానం మధ్య కొందరు బ్రోకర్లు చిచ్చు పెట్టి తమాషా చూస్తున్నారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడడని హెచ్చరించారు. బుల్లెట్ గాయాన్ని కూడా లెక్క చేయలేదని, ఇలాంటి జిమ్మిక్కులు తన వద్ద పనిచేయవని తెలిపారు. తనకు టికెట్ రాకపోవడంపై ఇటు టిడిపి వర్గీయులే కాదు.. వైసిపి వారు కూడా బాధపడుతున్నారని చెప్పారు. మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని చూశామని, ఇపడు తిక్కారెడ్డిని చూడాలని అనుకుంటున్నారని తెలిపారు. గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, ఇతర నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్నామని, ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. పార్టీ అధిష్టానం టికెట్ తనకే కేటాయిస్తుందని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. అంతకు ముందు కోసిగి మండలం జంపాపురం, చిన్నభూంపల్లి, దొడ్డి బెళగల్, పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం, బసలదొడ్డి, పులికనుమ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో టిడిపి టికెట్‌పై పునరాలోచించి తిక్కారెడ్డికే ఇవ్వాలని కోరారు. వైసిపి కోవర్ట్ రాఘవేంద్ర రెడ్డికి తాము పనిచేయబోమని తేల్చి చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు నాడిగేని మహాదేవ, చిన్నభూంపల్లి మాజీ సర్పంచి నరసింహులు, జంపాపురం మాజీ సర్పంచి కృష్ణారెడ్డి, చిన్నతుంబళం వీరేష్ ధని, సిద్ధప్ప ధని, సర్పంచి శివ, చంద్ర, బెళగల్ సర్పంచి రామయ్య, గుండేష్, రంగారెడ్డి, గోపాల్, శ్యామ్, నర్సారెడ్డి, శీను, బాలస్వామి, పేతురు, యోహాను, నాగేష్, పులికనుమ నల్లారెడ్డి, బసలదొడ్డి అయ్యప్ప, అంజినయ్య, వీరారెడ్డి, కృష్ణ, రజాక్, ఖాదర్ బాషా, యోహాను, చిన్నభూంపల్లి నీలకంఠ, ఉసేని, భీమురాయుడు, జంపాపురం నరసింహారెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థుల ఆశీస్సులతో శ్రీమఠం, ఐడిఎఆర్‌సి అంతర్జాతీయ సంస్థ సంయుక్తంగా శ్రీమఠం నిర్వహణలో ఉన్న 'శ్రీసుజయీంద్ర ఆరోగ్య'లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31న ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. తమిళనాడు రాష్ట్రం అరక్కోణానికి చెందిన రాఘవేంద్ర ట్రస్టు నేతృత్వంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ గిరిజా గణేష్, జివి.సురేష్, డాక్టర్ శంకర్, వైద్య నిపుణులు ఆర్థోపెడిక్, డయాబెటిస్, కార్డియాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, సిద్ధ హస్తులైన వైద్య బృందం, అత్యాధునిక యంత్రాలతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రాలయం వరకు బస్సులు నడపాలి : అత్తావుల్లా

ప్రజాశక్తి - నందవరం



గద్వాల, కర్నూలు నుంచి నాగలదిన్నె మీదుగా మంత్రాలయానికి బస్సులు నడపాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అత్తావుల్లా కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగలదిన్నె నుంచి మంత్రాలయానికి డబుల్ రోడ్డు వేసినట్లు తెలిపారు. బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగా ఉందన్నారు. గద్వాల నుంచి మంత్రాలయం దేవస్థానానికి నాగలదిన్నె మీదుగా బస్సులు నడిపితే డిపోలకు కూడా ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి సమయం ఆదా అవుతుందన్నారు. మంత్రాలయం, గద్వాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన వస్తోందని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకోసం ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేయడంతో గ్రామీణ గ్రామాల్లోని ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వీలు పడుతుందన్నారు. అలాగే కర్నూలు నుంచి మంత్రాలయానికి ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేస్తే కర్నూలుకు వెళ్లేందుకు ప్రయాణికులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఇప్పటికే తిమ్మందొడ్డి గ్రామం వరకు బస్సులు వస్తున్నాయని, అక్కడి నుంచి నాగలదిన్నె మీదుగా మంత్రాలయానికి బస్సు వేస్తే ప్రయాణికులు కర్నూలు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటేయాలి : ఎస్ఐ

హోళగుంద : ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవా లని ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు. మంగళవారం రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా పెద్దగోనెహాల్, మడ్డి లింగద హళ్లి గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎవరూ గొడవ పడకుండా ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

మూగజీవాల కోసం ఎల్ఎల్‌సి నీరు వదలండి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం



మూగజీవాలైన పశువులు, పక్షులు తాగేందుకు తుంగభద్ర దిగువ కాలువకు నీరు వదలాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. గత నెల రోజుల నుంచి జిల్లా ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు తుంగభద్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేశారని తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల అడవి ప్రాంతమంతా పచ్చగడ్డి లేక కనీసం నీరు లేక ఎడారి ప్రాంతాన్ని తలపిస్తోందన్నారు. తుంగభద్ర నది కూడా ఈ ఏడాది జనవరి నుంచి నీరు లేక వెలవెలబోతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పశువులు కనీసం తాగడానికి నీరు కూడా కరువైందన్నారు. ఈ సమస్య అధికారుల దృష్టికి తీసికెళ్లితే పిల్ల కాలువలకు, వంకలకు, వాగులకు నీటిని విడుదల చేయడానికి అనుమతి లేదని పేర్కొనడం బాధాకరమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వంకలకు, వాగులకు నీటిని విడుదల చేసి మూగజీవాలను రక్షించాలని కోరారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు

- ఎఆర్ఒ శ్రీధర్ మూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్ మూర్తి సూచించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ నేతృత్వంలో సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా సెక్టోరల్ విధి విధానాల గురించి వివరించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ మూర్తి

రెండో రోజూ హోలీ వేడుకలు

- వివిధ వేషధారణలో గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలో సంతేకుడ్లూరు గ్రామంలో రెండో రోజూ గ్రామస్తులు హోలీ వేడుకలు జరుపుకున్నారు. మంగళవారం రెండోరోజూ పురుషులు మహిళల్లా తయారయి కుంభాలు మోస్తూ పిండి వంటలతో నైవేద్యం తయారు చేశారు. చీర కట్టుకుని, జాకెట్టు వేసుకుని, జడలో మల్లెపూలు పెట్టుకుని రతి మన్మథులకు పూజలు చేశారు. చూసేవారికి, వినేవారికి ఇదో వింత సంప్రదాయంగా కనిపించినా.. గ్రామస్తులు మాత్రం భక్తిశ్రద్ధలతో ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. మగవారు సైతం ఎటువంటి బిడియం లేకుండా పాటిస్తున్నారు. దీనివల్ల గ్రామానికి సకల శుభాలు కలుగుతాయని ప్రగాఢ విశ్వాసంగా చెప్పుకుంటారు. ఆడవారి వేషం వేయడాన్ని ఒక నామోషీగా మాత్రం భావించరు. దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. యువకులు సైతం స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆడవారి వేషధారణతో అలరిస్తారు. మహిళలు ప్రత్యేకంగా వారిని అలంకరిస్తారు. ఈ ఆనవాయితీని, సంప్రదాయాన్ని చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారంటే.. ఎంత ప్రాచుర్యం పొందిందో అర్థం చేసుకోవచ్చు. వివిధ రకాలుగా వింత వేషధారణలు ధరిస్తూ.. గ్రామస్తులను అలరించడంతోపాటు గ్రామస్తులు అంత నవ్వుకునే విధంగా వేషాలు వేశారు. సాయంత్రం శాస్త్రాలతో పాటు వివిధ రకాల కామెడీ వేషాలు ధరించారు. సాయంత్రం చిన్న పిల్లలను ట్రాక్టర్ల మీద కూర్చోబెట్టుకుని పిల్లలను ముస్తాబు చేసి ఊరేగింపుగా నిర్వహించారు. అనంతరం రథోత్సవం లాగి, దేవాలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, చిన్న పీరయ్య, ఎర్రిస్వామి, సిబ్బంది నీలకంఠ, అశోక్, తిప్పన్న, శంకర్ రెడ్డి, రామయ్య, సుధాకర్ బందోబస్తు నిర్వహించారు.


మహిళల వేషధారణలో ఉన్న పురుషులు

విజయం ఎవరిదో..!

- నేడు ఆదోని 'బార్'కు ఎన్నికలు
- సాయంత్రానికే ఫలితాల వెల్లడి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని బార్ అసోసియేషన్‌కు బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి సుందర్ సింగ్, ప్రస్తుత అధ్యక్షులు అనితాబాయి పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి తాయన్న, జనార్ధన్ పోటీలో ఉండగా జనరల్ సెక్రటరీగా లోకేష్ కుమార్, సురేంద్ర కుమార్ బరిలో ఉన్నారు. కోశాధికారిగా మహ్మద్ లతీఫ్, అబ్దుల్ అన్సారీ పోటీలో ఉన్నారు. ఇప్పటికే జాయింట్ సెక్రటరీగా ఎస్‌వి.మల్లికార్జున, స్పోర్ట్స్ సెక్రటరీగా ఖలందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు, సీనియర్ న్యాయవాదులు శ్రీరాములు, రామలింగ తెలిపారు. బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, సాయంత్రానికే ఫలితాలు వెల్లడిస్తారని చెప్పారు. న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


సునీత బాయి


సుందర్ సింగ్

'బార్' ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి -ఆలూరు


వాయు జీవోత్తమ రావు, వలీ, షాకీర్

పట్టణంలోని బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది లక్ష్మీకాంత్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోగా వాయుజీవోత్తమ రావుకు మద్దతు తెలపడంతో అధ్యక్ష పదవి ఏకగ్రీవ మైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా వాయుజీవోత్తమరావు, షేక్షావలీ, కోశాధికారిగా షాకీర్, ఉపాధ్యక్షులుగా కృష్ణ కుమార్, సహాయ కార్యదర్శిగా ప్రసాద్ రావు, గ్రంథాలయం మోహన్, లేడీ రెప్రజెంటేటివ్‌గా సునీలా ఫ్లోరిన్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం : ఎస్ఐ

ప్రజాశక్తి - నందవరం

ప్రశాంత ఎన్నికల లక్ష్యంగా పోలీసు సిబ్బంది పని చేస్తోందని ఎస్ఐ పి.తిమ్మయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని ముగతి, నందవరంలో ఎస్ఎస్‌బి ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మయ్య మాట్లాడారు. ప్రశాంత ఎన్నికల్లో భాగంగా ఎస్-ఎస్‌బి ఫోర్స్‌తో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటర్లపై ఎవరైనా బలవంతం పెట్టినా, అల్లర్లు సృష్టించాలని ప్రయత్నం చేసినా, అలాంటి వారిపై బైండోవర్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా స్వచ్ఛందంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఎస్‌బి ఫోర్స్ సిబ్బంది, హెచ్‌సి.ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి


- కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనందరాజు, నియోజకవర్గ నాయకులు తిక్కన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కెవి.ఆనందరాజు, నియోజకవర్గ నాయకులు తిక్కన్న తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నకడబూరు గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. చిన్నకడబూరుకు చెందిన గొర్రెల అంజయ్య, మొండి నరసయ్యతో పాటు వారి కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, దేశంలో మతోన్మాద బిజెపి ఆగడాలు మితిమీరాయని, ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, వైసిపిలు కూడా బిజెపితోనే సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆంజనేయ, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు

ప్రజాశక్తి-ఆలూరు



జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఫిబ్రవరిలో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలో పాల్గొని విజయం సాధించినట్లు తెలిపారు. హత్తిబెళగల్ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు బి.మానస, పి.నూర్జహాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 27 నుంచి కర్ణాటక రాష్ట్రం దావనగిరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నబాబు అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి


గ్రామాల్లో పర్యటిస్తున్న వైసిపి నాయకులు

అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జుమ్మలదిన్నె, గౌడగల్లు, వందగల్లు, నేలకోసిగి గ్రామాల్లో బాలనాగిరెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేపట్టారు. వైసిపి మంత్రాలయం అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి గెలుపు కోసం అందరూ ఒక్కటై నాలుగోసారి గెలిపించుకుందామన్నారు. ఉదయం కోసిగి శ్రీరేణుకా ఎల్లమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జుమ్మలదిన్నె గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామిని దర్శించుకొని ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ పాలన కొనసాగింపు కోసం ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక ఓటు, ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యకు మరో ఓటు వేయాలని కోరారు.

సోమనాథ్‌కు టికెట్ ఇవ్వాల్సింది : తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


తిక్కా రెడ్డితో మాచాని సోమనాథ్, నాయకులు

టిడిపి ఎమ్మిగనూరు టికెట్ మాచాని సోమనాథ్‌కు ఇచ్చి ఉంటే బాగుండేదని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి అభిప్రాయ పడ్డారు. మంగళవారం తిక్కారెడ్డి ఎమ్మిగనూరులోని డాక్టర్ సోమనాథ్ ఇంటికి వెళ్లారు. మాచాని సోమనాథ్, తిక్కారెడ్డిలు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. ఎమ్మిగనూరులో చేనేత వర్గంతో పాటు బీసీలు అధికంగా ఉన్నారని, ఎంజి కుటుంబం నీతి, నిజాయితీగా ఉందని తెలిపారు. సోమనాథ్‌కు కూడా ప్రజాదరణ ఉందన్నారు. టిడిపి ఎమ్మిగనూరు టికెట్‌పై చంద్రబాబు మరో సారి ఆలోచించాలని కోరారు. తిక్కారెడ్డి, మాచాని సోమనాథ్ కలయిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కోనేరు నాగేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రెడ్డి, బైలుప్పల లక్ష్మీనారాయణ, మాచాని లక్ష్మిరెడ్డి ఉన్నారు.

వైసిపి పాలనలో అర్చకులకు రక్షణ లేదు

- బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కోఆర్డినేటర్ గురు రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వైసిపి పాలనలో అర్చకులకు రక్షణ లేదని, అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ కో ఆర్డినేటర్ కరణం గురు రాఘవేంద్ర రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కాకినాడ శివాలయంలో అర్చకులుగా పనిచేస్తున్న సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మపై ఆలయంలో దాడికి పాల్పడడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడికి దిగిన వైసిపి మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన నిందితునికి మద్దతు ఇస్తున్న ఆలయ ఇఒ, కాకినాడ జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అనేక ఆలయాల్లో అర్చకులపై దాడికి పాల్పడుతున్నారని, వైసిపి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు రక్షణ కరువైందని విమర్శించారు.